సాక్షి
చిత్తూరు
సోమవారం। 15। జూలై। 2024



ఆగని ఏనుగుల దాడులు

పెద్దపంజాణి మండలంలోని అటవీ సరిహద్దులో ఉన్న గ్రామాల్లో ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. - 8లో



మొక్కు తీర్చుకునేందుకు వెళ్తూ..

బోయకొండ గంగమ్మకు మొక్కు చెల్లించడానికి భక్తులతో వెళ్తున్న టాటా ఏస్ వాహనం బోల్తా పడి 15 మంది గాయపడ్డారు. - 8లో



విద్యుత్ సర్వీసులు ఇవ్వక..

జిల్లాలోని రైతులకు విద్యుత్ సర్వీసులు ఇవ్వకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. - 8లో

బాబూ.. ఇదేం పరీక్ష!



నామినేటెడ్ పోస్టుల విషయంలో చంద్రబాబు అనుసరిస్తున్న కొత్త పంథా చూసి పార్టీ క్యాడర్ గగ్గోలు పెడుతోంది. పార్టీ అధికారంలోకి వస్తే కష్టపడిన నాయకులకు తగిన గుర్తింపునిస్తామన్న బాబు తీరా 'కూటమి'గా జతకట్టి అధికారంలోకి రావడంతో ఆశావహుల విషయంలో పాము చావకుండా..కర్రా విరగకుండా అనే లెవెల్లో వారికి అగ్నిపరీక్ష పెట్టారు. తాను నిర్వహించే సర్వేలో ఎవరికి జనాదరణ ఉందో వారికే నామినేటెడ్ పదవులంటూ ఝలక్ ఇచ్చారు. పదవుల కోసం కూటమి నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొన్న తరుణంలో సర్వే చర్చనీయాంశమైంది. బహిరంగంగానే టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు.

నామినేటెడ్ పదవుల కోసం బాబు సర్వే

- ఐవీఆర్ఎస్ సర్వేపై బెంబేలెత్తుతున్న టీడీపీ క్యాడర్
- సర్వేలో నెగ్గితే తప్ప పదవుల్లేవు
- నెలరోజులుగా ఎమ్మెల్యేలతో అంటకాగిన ఆశావహులు
- కొత్త మెలికతో కళ్లు బైర్లు
- జనసేన, బీజేపీ నాయకులతో పోటీ
- ఐదేళ్లు పార్టీ కోసం కష్టపడినా గుర్తింపు లేదా? అని నిట్టూర్పు
- నేతల్లో రాజుకుంటున్న అసంతృప్తి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: పార్టీ అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవులు వస్తాయని భావించి పని చేసిన నాయకులకు అధినేత షాక్ ఇచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికే కాదు.. నామినేటెడ్ పోస్టులు కావాలన్నా సర్వేలో నిరూపించుకోవాల్సిందేనని మరోసారి తేల్చిచెప్పారు. అధినేత తీరుపై పార్టీ కేడర్‌లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల కోసం టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు పోటీపడుతున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో శాసనసభ, లోకసభ స్థానాలకు అభ్యర్థుల ఎంపికలో అవలంభించిన ఐవీఆర్ఎస్ సర్వేను నామినేటెడ్ పదవుల కేటాయింపులోనూ అనుసరించాలని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భావించినట్లు తెలుస్తోంది. దీంతో పదవుల కోసం నెల రోజులుగా ఎమ్మెల్యేలు, మంత్రులతో టచ్‌లో ఉన్న నాయకుల ఆశలన్నీ నీరుగారిపోయాయి. తిరుమల-తిరుపతి దేవస్థానం పాలకమండలి చైర్మన్‌తో పాటు శ్రీకాళహస్తి దేవస్థానం, తుడా చైర్మన్‌తో పాటు వివిధ కార్పొరేషన్ అధ్యక్ష, సభ్యుల కోసం ఎవరికి వారు పోటీపడుతున్న విషయం తెలిసిందే. పార్టీ కోసం కష్టపడిన వారిని పక్కనబెట్టిన అధిష్టానం సర్వే నివేదిక సమాచారం చూపించి తప్పించుకునేందుకు ప్రయత్నాలను ప్రారంభించింది. అందులో భాగంగా ఐవీఆర్ఎస్ సర్వే పేరుతో ఆలస్యం చేయడంతో పాటు.. తమకు అనుకూలమైన వారికి పదవులు కట్టబెట్టి, రాని వారికి సర్వేలో అనుకూలంగా రాలేదని చెప్పి, తప్పించుకునేందుకు ఎత్తుగడ వేసింది! పార్టీ అధిష్టానం ఐవీఆర్ఎస్ సర్వే పేరుతో విషమ పరీక్ష పెట్టడంతో ఆశావహుల్లో ఆందోళన మొదలైంది. పార్టీ బలోపేతం కోసం ఇన్నాళ్లూ కష్టపడి, తీరా అధికారంలోకి వచ్చాక తమకే నామినేటెడ్ పదవులు దక్కుతాయన్న గ్యారెంటీ లేకపోవడంతో పార్టీ క్యాడర్‌కు నిద్ర కరువవుతోంది.

కేడర్ అంటే చులకనా?

తిరుమల–తిరుపతి దేవస్థానం, శ్రీకాళహస్తీశ్వరస్వామి, కాణిపాకం ఆలయ పాలక మండలి అధ్యక్ష పదవులతో పాటు సభ్యులు, రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గ, మండల స్థాయి నామినేటెడ్ పదవులతో పాటు కార్పొరేషన్ చైర్మన్ వంటి పదవులపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఆశలు పెట్టుకున్నారు. పదవులు తమకే వరిస్తాయని ఇప్పటికే తన అనుయులతో గొప్పలు చెప్పుకున్నారు. ఇక పదవి వరించడమే తరువాయి అన్నట్లు నెలరోజులుగా నాయకులు, కార్యకర్తలు ఊహల్లో విహరించారు. తమకు పదవుల విషయంలో ఎలాంటి బ్రేకులు పడకుండా ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్య నాయకులతో సన్నిహితంగా మసలుతూ వారి తల్లో నాలుకగా విధేయతను ప్రదర్శిస్తున్నారు. అయితే 'తామొకటి తలచిన బాబొకటి తలచెన్' అని లెవెల్లో పార్టీ అధిష్టానం వారందరికీ ఝలక్ ఇచ్చింది. గతంలోలా ఈసారి కూడా ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన వారికే పదవులు వస్తాయనే వారి కలలను కల్లలు చేసింది. ఎమ్మెల్యే అనుగ్రహం ఒక్కటే ఉంటే సరిపోదు.. క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలు, ప్రజల అనుగ్రహం కూడా ఉండాలనే సాకు చూపించి, ఐవీఆర్ఎస్ సర్వేనే ప్రధాన ఆయుధంగా వారిపై ప్రయోగించేందుకు సిద్ధమైంది.

నేను మీ చంద్రబాబు నాయుడు...

''నేను మీ చంద్రబాబునాయుడు..మీ ప్రాంతంలో పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన రీతిలో గుర్తింపునివ్వాల్సిన అవసరం ఉంది..మీకో ఎస్ఎంఎస్ వస్తుంది. అందులో లింక్‌ను ఓపెన్ చేయండి.. మీప్రాంతంలో ఎవరైతే బాగా కష్టపడ్డారో వారి గురించి తెలియజేయండి..వారిని తగిన విధంగా గౌరవిస్తాం'' అని ఇటీవల ప్రజలకు టీడీపీ అధినేత చంద్రబాబు గొంతుకతో రికార్డెడ్ వాయిస్ కాల్స్ వచ్చాయి. దీంతో ఆ పార్టీ నాయకులు ఖంగుతిన్నారు. గుర్తింపు అనేది ఏ రూపంలో ఇస్తారో తెలియక జుత్తు పీక్కుంటున్నారు.! అలా ఎస్ఎంఎస్‌లో లింకులు వచ్చిన పక్షంలో తమ పేర్లు అందులో ప్రస్తావించాలని కొందరు నాయకులు ప్రజలు, కార్యకర్తలను ప్రాధేయపడుతున్నట్లు తెలియవచ్చింది. మరికొందరు దీనిని కూడా తమకు అవకాశంగా మలచుకునేందుకు గట్టిగా యత్నిస్తున్నట్టు తెలుస్తోంది.

అన్ని దశలూ దాటాల్సిందే!

నామినేటెడ్ పదవుల భర్తీకి టీడీపీ అధిష్టానం అన్ని అంశాలకు పరిగణనలోకి తీసుకుని పరీక్షించనుంది. ఐదు దశల్లో అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, జిల్లా పార్టీ అధ్యక్షుడు, పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులు, స్క్రీనింగ్ కమిటీల ద్వారా ఒక్కొక్క నియోజకవర్గం నుంచి ఆశావహుల జాబితాను 100మంది లోపు ఉండేలా సిద్ధం చేయించి ఆ పేర్లతో కూడిన జాబితాను అధిష్టానానికి పంపాలి. వారి సామర్థ్యం, విధేయత, నిబద్ధతను పరిగణనలోకి తీసుకుని ఏ పదవికి ఎవరెవరు సమర్థులో నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకుగాను వేర్వేరు జాబితాలను సిద్ధం చేసి అందులో ఉన్న వారి పేర్లను నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, ప్రజలకు ఫోన్లు చేసి ఐవీఆర్ఎస్ సర్వే చేయించి పదవులను ఎంపిక చేసేందుకు అధిష్టానం వేగంగా అడుగులు వేస్తుండడంతో ఆశావహుల్లో అంతర్మథనం మొదలైంది.

అవసరం తీరిందనుకుంటున్నారా?

ఎన్నికల సమయంలో పార్టీ అధికారంలోకి వస్తే ఆ చైర్మన్ పదవి నీకే..నీకే అని హామీలతో ఊదరగొట్టిన అధి నాయకులు.. అధికారంలోకి వచ్చాక సర్వే పేరుతో పదవులు కట్టబెట్టాలని చూస్తుండటంపై నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. పార్టీ కోసం కష్టపడిన తమకు అధికారం వచ్చాక పదవులను కట్టబెట్టేందుకు ఎక్కడలేని విచిత్రమైన విధానాలను అవలంభిస్తున్నారని కుతకుతమని ఉడికిపోతున్నారు. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీలకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల్లో శక్తివంచన లేకుండా శ్రమించామని ఎవరికి వారు అధిష్టానానికి వివరించారు. తమ శ్రమకు తగిన ఫలితం కోసం ఎదురు చూస్తున్నామని సమాచారం ఇచ్చారు. ఆశావహుల జాబితా పెద్దదిగా ఉందని చెప్పి, వారికి ఇష్టమొచ్చిన వారికి కట్టబెట్టి, చేతులు దులుపుకునేందుకు సర్వేకు పూనుకున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు చర్చించుకుంటున్నారు. సర్వే పేరుతో ఎవరికి పదవులు వరిస్తాయో.. ఎవరికి మొండిచెయ్యి చూపుతారోననే గుబులు నాయకులు, కార్యకర్తలకు నిద్రలేకుండా చేస్తుండటం కొసమెరుపు.

న్యూస్‌రీల్

ఆశాజనకంగా టమాటా ధరలు



వి.కోట మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

వి.కోట: టమాటా ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వి.కోట మార్కెట్‌కు ఆదివారం పెద్ద మొత్తంలో టమాటా కాయలు వచ్చాయి. మొదటి గ్రేడ్ కాయలు 16 కేజీలు ఉన్న క్రేట్ ధర రూ.900ల పలికింది. సెకండ్ గ్రేడ్ రూ.500 నుంచి రూ.700, థర్డ్ గ్రేడ్ రూ.250 నుంచి రూ.400 వరకు ధరలు పలికాయి. టమాటా పంటకు వైరస్ సోకడం, రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు కురుస్తుండడంతో దిగుబడి తగ్గింది. దీంతో డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ధరలు పెరిగినట్టు మండీ యజమానులు చెబుతున్నారు. ఈ ధరలు ఇలాగే నెల రోజులు ఉండవచ్చని పేర్కొంటున్నారు. గతంలో ఎకరాకు 500 బాక్సుల వరకు దిగుబడి వచ్చేదని, ఇప్పుడు అమాంతంగా తగ్గి 100 బాక్సుల వరకు మాత్రమే కాయలు వస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. గతంలో వీ.కోట నుంచి టమాటాలు చెన్నై, వేలూరు, గుడియాత్తం, మదురై, అర్కాడ్, తిరుచ్చి, నైవేలీ మార్కెట్లకు టమాటాలు వెళ్లేవని, ఇప్పుడు ఢిల్లీ, రాజాస్తాన్, కోల్‌కతా, ముంబయికి కూడా వెళుతున్నట్టు మండీ యజమానులు తెలిపారు. అలాగే రోజుకు వీ.కోట మార్కెట్ నుంచి 25 కేజీల బాక్సులు సుమారు పది వేలు, 15 కేజీల బాక్సులు సుమారు 15 వేలు పంపిస్తున్నామని వివరించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. ఎవరైనా గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

నేడు పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై తనకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

22 నుంచి వారోత్సవాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని సర్కారు స్కూళ్లలో జూలై 22 వ తేదీ నుంచి వారోత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర సమగ్రశిక్ష అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు జారీ చేసిన షెడ్యూల్ మేరకు జిల్లాలోని ప్రభుత్వ పరిధిలోని పాఠశాలల్లో ఈ నెల 22వ తేదీ నుంచి 28 వరకు వారోత్సవాలను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. జాతీయ విద్యావిధానం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా సమగ్ర శిక్ష అధికారులు వారోత్సవాలకు కసరత్తు నిర్వహిస్తున్నారు.

ఫారిన్ సర్వీసెస్‌కు అనుమతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు ఫారిన్ సర్వీసెస్‌లో పని చేసేందుకు రాష్ట్ర మోడల్ స్కూల్స్ జేడీ వెంకటకృష్ణారెడ్డి అనుమతి ఇస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు ఫారిన్ సర్వీసెస్‌లో విజయవాడలోని రాష్ట్ర మోడల్ స్కూల్ కార్యాలయంలో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు డీఈఓల ప్రతిపాదనతో ఈ నెల 31వ తేదీలోపు రాష్ట్ర కార్యాలయానికి ఉత్తర్వులు పంపాలన్నారు.

రెస్కో ఎండీగా సోమశేఖర్

కుప్పం: గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో)నూతన ఎండీగా సోమశేఖర్‌ను నియమితులయ్యారు. ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఈయనను రెస్కో ఎండీగా బదిలీ చేస్తూ ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ సంతోష్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రెస్కో ఎండీగా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ప్రత్యేక అధికారిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో నూతన ఎండీగా సోమశేఖర్‌ను నియమించడంతో త్వరలోనే ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. అలాగే రెస్కోపై వస్తున్న ఆరోపణలకు సంబంధించి విచారణ అధికారిగా విజయవాడలోని కోఆపరేటివ్ సొసైటీలో అడిషనల్ సెక్రటరీగా పని చేస్తున్న శ్రీలక్ష్మీని ప్రభుత్వం నియమించింది.

ఎస్వీయూలో మూడు ముక్కలాట

- వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్ పదవులకు పోటాపోటీ
- కూటమిలోని మూడు ప్రధాన పార్టీల అనుచరుల ఒత్తిళ్లు
- రాజకీయ చదరంగంతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఉద్యోగులు
- వీసీ, రిజిస్ట్రార్ నియామకాలపై ఎటూ తేల్చని ప్రభుత్వం



ఎస్వీయూ ప్రధాన ద్వారం ముఖచిత్రం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో పదవుల కోసం మూడు ముక్కలాటథ ప్రారంభమైంది. కూటమిలోని తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీ అభిమానులుగా ముద్ర పడిన సీనియర్ ప్రొఫెసర్లు, విశ్రాంత ప్రొఫెసర్లు ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. నెలరోజులుగా మందీ మార్బలంతో పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మూడు పార్టీల నుంచి వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్ పదవులకోసం తీవ్ర ఒత్తిడి రావడంతో ప్రభుత్వం ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో పడినట్టు సమాచారం. తాము ఆశిస్తున్న పదవులకు రాష్ట్ర స్థాయి నాయకులతోనే కాకుండా విదేశాలలో స్థిరపడిన ప్రముఖ ఎన్నారైలు, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఎమ్ఎన్‌సీ కంపెనీల సీఈఓలతో సైతం ఒత్తిళ్లు తెస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. అయితే సామాజిక వర్గాల సమీకరణలతో సంబంధం లేకుండా ఒక్కో పోస్టును ఒక్కో పార్టీకి చెందిన వారికి కట్టబెట్టాలంటూ కూటమిలోని ప్రధాన పార్టీకి చెందిన ముఖ్యనేత ఒకరు విద్యాశాఖ మంత్రికి సిఫారసు చేసినట్లు సమాచారం.

వర్సిటీలో స్తంభించిన పాలన

రాజకీయ చదరంగంతో ఎస్వీయూలో నెల రోజులుగా పాలన పూర్తిగా స్తంభించిపోయింది. ఒక్క ఫైలు కూడా కదలడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఉన్నతాధికారులు రాజీనామా చేయడంతో విద్యార్థులు, ఉద్యోగులు నరకం అనుభవిస్తున్నారు. ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్లు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాత్కాలిక ఉద్యోగుల పరిస్థితి వర్ణనాతీతం. పరిశోధక విద్యార్థుల విషయంలో యూనివర్సిటీ రీసెర్చ్ సెంటర్(యూఆర్‌సీ), పీహెచ్‌డీల వైవాలు, డెమోలు పూర్తిగా నిలిచిపోయాయి. వెంటనే ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్లను నియమించాల్సిన అవసరం ఉందని ఎస్వీయూ ఉద్యోగులు కోరుతున్నారు.

గత వీసీల రాజీనామాలకు పడని ఆమోదముద్ర

సజావుగా పాలన సాగుతున్న వర్సిటీలలో అధికార పార్టీనేతలు ఒక్కసారిగా అలజడి సృష్టించారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రెండవ రోజు నుంచే రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులు, దాడులు అస్త్రాలుగా నూతన ప్రభుత్వం ప్రయోగించి వీసీ, రిజిస్ట్రార్ల చేత రాజీనామాలు చేయించింది. రాజీనామాలకు ససేమిరా అన్న వర్సిటీలలో కూటమి అనుబంధ విభాగాల విద్యార్థి సంఘాలు, నాయకులు దాడులు చేసి, అధికారులను బెదిరించి, రాజీనామా చేయించారు. ఈ పరిణామాలకు దాదాపు రాష్ట్రంలోని అన్ని వర్సిటీల వీసీలు, రిజిస్ట్రార్లు తమ రాజీనామాలను ఉన్నత విద్యామండలికి సమర్పించి గవర్నర్ ఆమోదానికి పంపారు. కానీ నెల రోజులు కావస్తున్న ఇంతవరకూ రాజీనామాలకు ఆమోద ముద్ర పడలేదు. ఇందుకు మూడు ముక్కలాటే కారణమని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఒత్తిడి తగ్గే వరకు వీసీల రాజీనామాలకు ఆమోదముద్ర పడనీయకుండా కావాలని ప్రభుత్వం ఆడుతున్న నాటకంగా విద్యావేత్తలు భావిస్తున్నారు. అంతే కాకుండా గతంలో ఏ ప్రభుత్వమూ ఉన్నత విద్యావ్యవస్థలకు ఇలా రాజకీయ మకిలి అంటించిన దాఖలాలు లేవని విద్యావేత్తల్లో ఆందోళన సైతం వ్యక్తమమైంది.

● సంతోష 'తీరం'



తూపిలిపాళెం బీచ్‌లో సరదాగా గడుపుతున్న పర్యాటకులు

సెలవు దినం కావడంతో ఆదివారం మండలంలోని తూపిలిపాళెం సముద్ర తీరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు సందడి చేశారు. వాతావరణంలో మార్పుల కారణంగా ప్రస్తుతం సన్నని తుంపర్ల వర్షం పడుతున్నప్పటికీ అలల తీవ్రత తక్కువగా ఉండడం విశేషం. దీంతో బీచ్‌కు వచ్చిన పర్యాటకులకు సముద్రం అంచున ఆనందంగా గడిపారు. యువకులు, మహిళలు తీరంలో కేరింతలు కొడుతూ సందడి చేశారు.

– వాకాడు

స్కూల్ లాగిన్‌లో టెన్త్ రీకౌంటింగ్ ఫలితాలు

చిత్తూరు కలెక్టరేట్ :పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల మార్కుల రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫలితాలు ఆయా స్కూల్ లాగిన్‌లో నమోదు చేసినట్టు డీఈఓ దేవరాజు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలపై సందేహంతో రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వారి ఫలితాలు విడుదల చేశారన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు సంబంధిత పాఠశాల హెచ్ఎం వద్దకు వెళ్లి లాగిన్‌లో రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫలితాలను చూసుకోవాలని డీఈఓ వెల్లడించారు.

ఎంపిక కమిటీలో మెంబర్‌గా ఆర్జేడీ

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లా ఎంపిక కమిటీలో వైఎస్సార్ కడప జిల్లా ఆర్జేడీ శామ్యూల్‌ని మెంబర్‌గా నియమిస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లా వ్యాప్తంగా ఈ విద్యాసంవత్సరానికి గానూ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు చేసుకున్న టీచర్ల ఎంపిక ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇందుకు జారీచేసిన నియమ నిబంధనలను పాటిస్తూ ప్రత్యేక కమిటీ ఎంపికలు చేయాల్సి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైభవంగా వలస దేవుళ్లు



గ్రామస్తులంతా ఊరు వదిలి వెళ్లడంతో ఖాళీగా కనిపిస్తున్న గుడికొత్తూరు గ్రామం



గంగమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న జనం

గుడుపల్లె: గ్రామంలో ఎలాంటి గ్రహ దోషాలు, అవాంఛనీయ కీడు జరగకుండా మండలంలోని గుడికొత్తూరు గ్రామంలో ఆదివారం వలస దేవళ్ల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకే గ్రామంలోని ప్రతి ఒక్కరూ, పశువులు, గ్రామ దేవతల విగ్రహాలను తీసుకుని ఇళ్లకు తాళాలు వేసుకుని గ్రామ సమీపంలోని గంగమ్మ ఆలయం, గోపాలస్వామి ఆలయాల వద్దకు చేరుకున్నారు. ఎవరూ గ్రామంలోకి ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవతలకు పొంగళ్లు పెట్టి నైవేద్యంగా సమర్పించారు. మధ్యాహ్నం వనభోజనాలు చేశారు. సాయంత్రం గ్రామ దేవతలను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి అంతా ఇళ్లకు చేరుకున్నారు. ప్రతి 5 ఏళ్లకు ఒకసారి గ్రామంలో వలస దేవుళ్ల కార్యక్రమం నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఇలా చేయడం వల్ల గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొని, అందరూ సుభిక్షంగా ఉంటారని, అలాగే గ్రామానికి ఎలాంటి కీడు జరగదని తమ నమ్మకం అన్నారు.

దీవించమ్మా.. గంగమ్మా..



ఆలయం లోపల భక్తుల రద్దీ

- భక్తులతో కిటకిటలాడిన బోయకొండ

చౌడేపల్లె: 'కోరిన కోర్కెలు తీర్చే అమ్మ.. గంగమ్మ తల్లీ మా కోరికలు తీర్చి ఆశీర్వదించమ్మా'.. అంటూ బోయకొండకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢమాసం అమ్మవారికి ప్రీతిపాత్రమైన నెల కావడంతో ఈ మాసంలో ఏటా రద్దీ అధికంగా ఉంటుంది. ఆదివారం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సుమారు 30వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అమ్మవారిని రంగురంగుల పూలు, బంగారు నగలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి జంతుబలులు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఎటు చూసినా భక్తులతో పాటు వాహనాల రాకపోకలతో బోయకొండ, పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. ఆలయ అధికారులు భక్తులకు అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు, భక్తులు అవస్థలు పడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.

ఒక్కరోజులోనే రూ.19.02 లక్షల ఆదాయం

అమ్మవారి ఆలయానికి ఆదివారం ఒక్కరోజు మాత్రమే వివిధ సేవా టికెట్లు, ప్రసాదాల టికెట్ల విక్రయాల ద్వారా ఆలయానికి రూ.17.51 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. వీటితోపాటు అన్నదానం నిర్వహణకు రూ.1.51 లక్షలు మొత్తం రూ.19.02 లక్షలు విరాళాల రూపంలో అందినట్లు చెప్పారు.

క్లుప్తంగా

లారీని ఢీకొన్న బస్సు



లారీని ఢీకొట్టిన బస్సు

పూతలపట్టు: ముందు వెళ్తున్న ఓ లారీ సడెన్‌గా ఆగడంతో వెనుక వస్తున్న బస్సు ఢీకొని ఐదుగురు స్వల్పంగా గాయపడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. సీఐ సుదర్శన ప్రసాద్ వివరాల మేరకు.. కర్ణాటకకు చెందిన కేఏ40ఎఫ్891 నంబరు గల బస్సు ఆదివారం ఉదయం తిరుపతి నుంచి బెంగళూరుకు వెళ్తుండగా పి.కొత్తకోట ఓవర్ బ్రిడ్జి వద్ద ముందు వెళ్తున్న ఏపీ05యూ0657 నంబర్ గల లారీ సడెన్‌గా ఆగడంతో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులోని ఐదుగురికి స్వల్ప గాయాలు కావడంతో వారిని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ప్రయాణికులను మరో బస్సులో బెంగళూరుకు పంపించినట్లు సీఐ తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదని, బాధితుల వివరాల మేరకు కేసు నమోదు చేశామన్నారు.

విద్యుత్ సర్వీసులు ఇవ్వక..

నీరున్నా జిల్లాలోని రైతులకు కన్నీరే దిక్కవుతోంది. చెరుకు, వేరుశనగ, టమాటా, వరి పంటలు వేయడానికి సిద్ధమయ్యారు. కానీ విద్యుత్ సర్వీసులు రాక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పెరిగిన పెట్టుబడి ఖర్చులతో సతమతం అవుతున్న అన్నదాతకు విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటు కొత్త తలనొప్పులను తెచ్చి పెడుతోంది. దీనికి తోడు గత నెల రోజులుగా జిల్లా స్టోర్లకు వ్యవసాయ విద్యుత్ పరికరాలు రావడం లేదు. జిల్లాలో 6,374 సర్వీసులకు డబ్బులు చెల్లించిన రైతులు ఎదురు చూస్తున్నారు.

- అవస్థ పడుతున్న అన్నదాతలు
- జిల్లాలో సుమారు 6,374 సర్వీసులు పెండింగ్
- విద్యుత్ వ్యవసాయ పరికరాలు ఎప్పుడు వస్తాయో తెలియని వైనం
- సర్వీసు ఇవ్వడానికి రైతులతో బేరాలు కుదుర్చుకుంటున్న కిందిస్థాయి సిబ్బంది



చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో విద్యుత్ పరికరాలు మొత్తం జిల్లాస్టోర్స్‌కు వస్తాయి. అక్కడి నుంచి సంబంధిత సెక్షన్లకు వెళ్తాయి. కానీ గత నెలరోజులుగా ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్, కండక్టర్ రావడం లేదు. దీంతో క్షేత్రస్థాయిలో రైతులు అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ సర్వీసులకు డబ్బులు కట్టిన అన్నదాతలు వేదనకు గురవుతున్నారు. స్టాక్ కచ్చితంగా ఎప్పుడు వస్తోందో చెప్పలేని స్థితిలో అధికారులు ఉన్నారు.

అంతా బేరం

త్వరలో స్టాక్ వస్తుంది. తొలుత మీకే సర్వీసు ఇవ్వాలంటే 'మాకేమిటి' అని విద్యుత్ సిబ్బంది బేరాలు కుదుర్చుకుంటున్నారు. స్టాక్ ఎప్పుడు వస్తుందో అధికారులు తెలియక అవస్థలు పడుతుంటే క్షేత్రస్థాయిలో లైన్‌మెన్లు తమ స్వలాభం కోసం ఇలా దిగజారి రైతులను మరింత క్షోభకు గురిచేస్తున్నారు.

డబ్బులు కట్టారు

సాధారణంగా వ్యవసాయ సర్వీసులు కావాలంటే ఓల్టా, వీఆర్వో, బోర్‌వేల్ ధ్రువీకరణ పత్రాలతో మీసేవా కేంద్రాల్లో రూ.150 చెల్లించి దరఖాస్తు చేసుకుంటారు. అనంతరం వారికి ఏఈ, డీఈ, ఈఈలు స్థాయిని బట్టి అనుమతులు ఇస్తారు. హెచ్‌పీకి రూ.1200, సెక్యూరిటీ డిపాజిట్ రూ.40 చొప్పున డబ్బులు చెల్లిస్తారు. సర్వీసు విడుదల అయ్యాక 3 విద్యుత్ స్తంభాలు, 180 మీటర్లు ఎల్‌టీ లైన్, 1 ట్రాన్స్‌ఫార్మర్ ఉచితంగా ఇస్తారు. దానిపై కావాలంటే నిబంధనల ప్రకారం డబ్బులు కట్టాలి.

6,374 సర్వీసులు పెండింగ్..

ఉమ్మడి జిల్లాలోని 8 డివిజన్లలో మొత్తం 6,374 మంది రైతులు సర్వీసుల కోసం డబ్బులు కట్టి వేచి చూస్తున్నారు. స్టాక్ ఎప్పుడు వస్తుందో ఆ శాఖ అధికారులకు స్పష్టత లేదు. దీంతో రైతులకు ఇప్పట్లో కష్టాలు తీరేలా లేవు.

తిరుపతి ఆపరేషన్	:	8
తిరుపతి రూరల్	:	456
పుత్తూరు	:	898
చిత్తూరు అర్బన్	:	257
చిత్తూరు రూరల్	:	186
మదనపల్లె	:	2598
పీలేరు	:	587
పుంగనూరు	:	1385
మొత్తం	:	6374

ఎక్కువగా మదనపల్లెలో 2598, పుంగనూరులో 1385, పుత్తూరులో 898 డివిజన్లలో దాదాపు 5 వేల సర్వీసులు ఇవ్వాల్సి ఉంది.

సర్వీసులు ఇస్తాం..

వ్యవసాయ సర్వీసులు సీనియార్టీ ప్రకారం విడుదల చేయాలని ఈఈలను ఆదేశించాం. విద్యుత్ అనుబంధ పరికరాలు స్టాక్ వచ్చాక వాటిని రైతులకు అందజేస్తాం.

- సురేంద్రనాయుడు, ఎస్‌ఈ ట్రాన్స్‌కో

ప్రాథమిక స్కూళ్లను కాపాడండి

- ప్రైమరీ స్కూళ్లు బలపడకుండా హైస్కూళ్లు బలోపేతం కావడం అసాధ్యం
- విద్యావ్యవస్థపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం వల్లే విద్యార్థుల చేరికలు తక్కువయ్యాయి
- ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణ కొరవడింది
- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

శ్రీరంగరాజపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు 33 వేల ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని, గతంలో కంటే ప్రస్తుతం స్కూళ్లలో విద్యార్థుల ప్రవేశాలు తక్కువగా ఉన్నాయని, వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు కోరారు. మండలం కేంద్రంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో జిల్లా యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలు బలోపేతం కాకుండా మాధ్యమిక, ఉన్నత పాఠశాలలు బలోపేతం కావడం అసాధ్యమన్నారు. ఈసారి ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల ప్రవేశాలు చాలా తక్కువగా జరిగాయన్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థపై దృష్టి పెట్టకపోవడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు విద్యావసరులను కల్పించాలని, ఇంకా కొన్ని స్కూళ్లలో పుస్తకాలు పంపిణీ చేయలేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్, ఐబీ, టోఫెల్ విధానాలను ఉపసంహరించుకోవడంతో విద్యార్థులు టీసీ తీసుకుని వెళ్లి ప్రైవేటు స్కూళ్లలో చేరుతున్నారని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో విపరీతంగా ఫీజులు పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ద్వారా ఉద్యోగం పొందిన వారికి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని, 1998, 2008 ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. అలాగే పీఆర్సీలోని ఐఆర్‌ను 30 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సోముశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మొక్కు తీర్చుకునేందుకు వెళ్తూ..

- బోయకొండకు భక్తులతో వెళ్తున్న టాటాఏస్ వాహనం బోల్తా
- 15 మందికి గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం
- క్షతగాత్రులను 108లో మదనపల్లె ఆస్పత్రికి తరలింపు



ఘటనా స్థలంలో గాయపడిన క్షతగాత్రులు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మకు మొక్కు తీర్చుకునేందుకు భక్తులతో వెళ్తున్న ఓ టాటా ఏస్ వాహనం పుంగనూరు–బోయకొండ మార్గంలోని కరణంవారిపల్లె సమీపంలో అదుపు తప్పి బోల్తా పడడంతో 15 మంది గాయపడిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. కోలార్ జిల్లా కేజీఎఫ్ తాలూకా పుగనపల్లె, కొడిగిపల్లె, ఉట్నూరు గ్రామాలకు చెందిన భక్తులు ఆదివారం బోయకొండ గంగమ్మకు మొక్కులు చెల్లించడానికి బంధుమిత్రులతో కలిసి టాటాఏస్ వాహనంలో బయలుదేరారు. కరణంవారిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇవ్వడానికి వాహనాన్ని డ్రైవర్ రోడ్డు పక్కకు దింపాడు. మళ్లీ రోడ్డుపైకి ఎక్కించే క్రమంలో వాహనం అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో వాహనంలో ఉన్నవారు రోడ్డుపైకి ఎగిరి పడ్డారు. క్షతగాత్రుల ఆర్తనాదాలు విన్న స్థానికులు బోల్తాపడిన వాహనాన్ని లేపి కింద ఇరుక్కున్న వారిని బయటకు తీశారు. ఈ ఘటనలో వెంకట్రామప్ప(60), సుగుణమ్మ(35), సుబ్బరత్నమ్మ(55), కృష్ణమ్మ(45), సుమ(29), నారాయణమ్మ (40), సుశీలమ్మ(45)తో పాటు మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వీరిలో వెంకట్రామప్ప, సుబ్బరత్నమ్మ, సుగుణమ్మకు తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు. గాయపడిన వారిని 108 వాహనాల ద్వారా మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారులపై అత్యాచారాలను అరికట్టాలి



కొవ్వొత్తుల ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

- వాసంతి కుటుంబానికి న్యాయం చేయాలి
- అమ్మాయిల మిస్సింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి
- ఎస్ఎఫ్ఐ, ఐద్వా నేతల డిమాండ్ చేశారు.

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో గత రెండు వారాల నుంచి వరుసగా చిన్నారులపై అత్యాచారాలు పెరిగిపోవడం సిగ్గుచేటని, వీటిని అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. చిన్నారులపై అత్యాచారాలకు వ్యతిరేకంగా, వారికి రక్షణ కల్పించాలని, వాసంతి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా మహిళా సంఘం, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఎంఆర్ పల్లె సర్కిల్ దండి మార్చ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ర్యాలీ , కొవ్వొత్తుల ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో చిన్నారి వాసంతి కేసులో ఇప్పటికీ మృతదేహం లభించకపోవడం, మిస్సింగ్ కేసు ఛేదించడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి కనిపిస్తోందని విమర్శించారు. ఏర్పేడులో చిన్నారిపై జరిగిన సంఘటన దుర్మార్గమన్నారు. పాఠశాల స్థాయిలోనే మహిళలను గౌరవించే విధంగా చూడాలన్నారు. తద్వారా కొంతవరకు అత్యాచారాలు అరికట్టవచ్చన్నారు. ఇటీవల సమాజంలో మహిళలపై దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని, శిక్షలు మాత్రం నామమాత్రంగా విధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల భద్రతే తమ పార్టీ ముఖ్య ఉద్దేశమని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయాన్ని గాలికి వదిలేశారని విమర్శించారు. ఇప్పటికైనా అత్యాచారాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జయంతి, ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, తేజ, భార్గవ్, నరేంద్ర, శ్రీనివాస్, గణేష్, హర్షద్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు విరాళం



విరాళం అందజేస్తున్న దాత పవన్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని అన్నదాన, గోసంరక్షణ ట్రస్టుకు ఆదివారం దాతలు నగదు విరాళం అందించారు. నెల్లూరు జిల్లాకు చెందిన పవన్ శ్రీనివాస్ అన్నదాన ట్రస్టుకు రూ.50,011, గోసంరక్షణ ట్రస్టుకు రూ.50,011 చెక్కు రూపంలో ఆలయ అధికారులకు అందజేశారు. అలాగే తిరుపతికి చెందిన సుబ్రమణ్యం రెడ్డి గోసంరక్షణ ట్రస్టుకు రూ.1,85,000 చెక్కును విరాళంగా అందించారు. అనంతరం దాతలకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు. వేదపండితుల ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ హరిమాధవరెడ్డి, సిబ్బంది వాసు, రమేష్ ఉన్నారు.



చెక్ అందజేస్తున్న దాత సుబ్రమణ్యంరెడ్డి కుటుంబ సభ్యులు

రెచ్చిపోయిన చైన్‌స్నాచర్లు



బాధితురాలు శకుంతలమ్మ

నాగలాపురం: చైన్‌స్నాచర్లు రెచ్చిపోయారు. ఓ వృద్ధురాలి మెడలో నుంచి లాఘవంగా బంగారు గొలుసు లాక్కెళ్లి ఉడాయించారు. ఈ ఘటన పిచ్చాటూరు మండలంలోని అప్పలరాజు కండ్రిగలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం..మండలంలోని అప్పలరాజు కండ్రిగకు చెందిన శకుంతలమ్మ(62) సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తన ఇంటి ముందు కూర్చొని ఉండగా ఇద్దరు ఆగంతకులు స్కూటీ మీద వచ్చి ఆమె మెడలో ఉన్న 36 గ్రాముల (2,32,000 రూపాయల విలువ) బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఆమెకు ఎవరూ లేకపోవడంతో దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఆగని ఏనుగుల దాడులు

పెద్దపంజాణి: మండలవ్యాప్తంగా అటవీ సరిహద్దులో ఉన్న గ్రామాల్లో గత కొంతకాలంగా ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని అడవికి సరిహద్దులో ఉన్న అకులవారిపల్లి, జిట్టంవారిపల్లి, గౌరీనగర్, ముదిరెడ్డిపల్లి, పెనుగొలకల, తిప్పిరెడ్డిపల్లి, కొత్తబూరగపల్లి గ్రామాలకు చెందిన రైతులు పొలాల్లో సాగు చేసిన పంటలను నాశనం చేస్తున్నాయి. శనివారం రాత్రి పలమనేరు రేంజ్ కీళపట్ల ఫారెస్టు నుంచి వచ్చిన ఏనుగులు పెద్దకాప్పల్లికి చెందిన రైతు రమణారెడ్డి మామిడి తోటపై విరుచుకుపడ్డాయి. అదేవిధంగా పెనుగొలకల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గౌరీనగర్ ఫీడర్‌లోని కరెంట్ స్తంభాన్ని నేలకూల్చాయి. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు విద్యుత్తు స్తంభం దారికి అడ్డంగా పడి ఉన్న విషయాన్ని సంబంధిత శాఖ అధికారులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న వారు వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

ఆగస్టు 4న ఆర్యవైశ్య మహాసభ

కాణిపాకం: ఆగస్టు 4వ తేదీన ఆర్యవైశ్య మహాసభ చిత్తూరు జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకారం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు సల్లా శివశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కర్నూలులోని మాజీమంత్రి టీజీ వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు సుబ్బరాయుడు, రత్నకుమార్, సురేష్‌బాబు, బచ్చు సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

ఇంటి తాళం పగులగొట్టి ఆభరణాల చోరీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఇంటికి వేసిన తాళాన్ని పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేసిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు.. ఎస్టేట్‌లో లక్ష్మి అనే మహిళ టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తోంది. శనివారం ఆమె కూతురు, అల్లుడు ఓ గదిలో పడుకోగా, ఆభరణాలు ఉన్న గదికి తాళం వేసి, కింద ఉన్న టైలరింగ్ గదిలో లక్ష్మి పడుకుంది. ఉదయం లేచి చూసేసరికి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 42 గ్రాముల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మృతదేహంతో రోడ్డుపై గ్రామస్తుల నిరసన





మృతదేహంతో నిరసన తెలుపుతున్న మృతురాలి బంధువులు, దేవిక మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం : పాలు పితుకుతుండగా ఆవు తన్నడంతో గాయపడిన మహిళ మృతిచెందింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని పోలీసులు చెప్పడంతో మృతురాలి బంధువులు, గ్రామస్తులు రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సంఘటన మండలంలోని సీ.కే.పురం గ్రామం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సీకే.పురం గ్రామానికి చెందిన దేవిక (57) శనివారం సాయంత్రం పాలు పితుకుతుండగా ఆవు తన్నింది. దీంతో దేవిక పక్కనున్న రాయిపై పడడంతో తలకు గాయమైంది. కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. సీ.కే.పురం గ్రామానికి చెందిన గుర్తు తెలియని వ్యక్తి 100 పోలీసు హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి దేవిక మృతిపై అనుమానాలు ఉన్నాయని చెప్పాడు. దీంతో ఎస్‌ఐ రాజాకుళ్లాయప్ప తన సిబ్బందితో ఆదివారం ఉదయం గ్రామానికి చేరుకున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని మృతురాలి బంధువులకు చెప్పడంతో వారు అంగీకరించలేదు. పోస్టుమార్టం చేయడం తమకు ఇష్టం లేదని, దహన క్రియలు నిర్వహించుకుంటామని చెప్పారు. ఈ క్రమంలో పోలీసులు, బంధువుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామస్తులు చిత్తూరు - పుత్తూరు జాతీయ రహదారిలో మృతదేహాన్ని ఉంచి నిరసన తెలిపారు. దీంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు అక్కడికి చేరుకుని గ్రామస్తులతో విచారించారు. ఆవు తన్నడంతో దేవిక రాయిపై పడి గాయపడిందని, వేరే కారణం లేదని గ్రామస్తులు తెల్పి చెప్పారు. అనంతరం అధికారుల అంగీకారంతో గ్రామస్తులు నిరసన విరమించి దహనక్రియలు నిర్వహించారు.

దహన క్రియలను అడ్డుకోవడం దారుణం

వైఎస్సార్‌సీపీ మహిళా సీనియర్ నాయకురాలు దేవిక దహనక్రియలను పోలీసులు అడ్డుకోవడం దారుణమని గంగాధరనెల్లూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కళత్తూరు కృపాలక్ష్మి మండిపడ్డారు. మండలంలోని సీకేపురం గ్రామానికి చెందిన దేవిక(57) ప్రమాదవశాత్తు మరణించారు. అయితే ఆమె దహన క్రియలను స్థానిక ఎస్‌ఐ రాజకుళ్లాయప్ప, పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై కళత్తూరు కృపాలక్ష్మి మాట్లాడుతూ పోలీసులు దేవిక మరణం అనుమానాస్పదంగా ఉందంటూ దహన క్రియలు జరగకుండా అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. మరణించిన వారి దహనక్రియలను అడ్డుకుని వారి కుటుంబసభ్యులను, బంధువులను మానసికంగా కుంగదీసేలా పోలీసులు వ్యవహరించడం మంచిది కాదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలోనే ఇలాంటి దురాగతాలు జరగడం సిగ్గు చేటన్నారు. రాజకీయ కుట్రలతో పుట్టెడు దుఃఖంలో ఉన్న వారి కుటుంబాన్ని వేధింపులకు గురు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఇలాంటి అవమానకరమైన ఘటన దేశంలో ఎక్కడా జరగలేదని, ఇకనైనా సీఎం చంద్రబాబు నాయుడు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. పోలీసులతో పోరాడి దేవిక దహన క్రియలు జరిగేలా చేసిన కృపాలక్ష్మికి గ్రామస్తులు, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దేవిక మృతదేహంపై కృపాలక్ష్మి పూలమాల వేసి నివాళులు అర్పించారు